సాక్షి తిరుపతి

మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ప్రజారోగ్య రక్షణకే వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25లక్షలకు పెంచినట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. - 8లో



'దర్శన' ప్రాప్తిరస్తు!

వైకుంఠ ద్వారా దర్శనానికి వెళ్లే భక్తులకు టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేస్తోంది. - 8లో



గవర్నర్‌కు సాదర స్వాగతం

తిరుపతి పర్యటనకు విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,845 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,122 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.44 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

'స్పందన' అర్జీలకు ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జేసీ పెంచల కిషోర్

తిరుపతి అర్బన్ : ప్రజలు వివిధ సమస్యలపై స్పందన కార్యక్రమంలో అందిస్తున్న అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని, త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఇన్‌చార్జి జేసీ పెంచల కిషోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. పెంచల కిషోర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనకు మొత్తం 145 వినతుల వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, శ్రీనివాసరావు, భాస్కర్‌నాయుడు, నరసింహులు, కలెక్టరేట్ ఏఓ జయరాములు పాల్గొన్నారు.

20 వరకు రేషన్ పంపిణీ

తిరుపతి అర్బన్ : రేషన్ షాపుల్లో ఈ నెల 20వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజా రఘువీర్ ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా రేషన్ పంపిణీలో జాప్యం జరిగిందని, అందుకే మరో మూడు రోజులపాటు పొడిగించినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నోడల్ అధికారి సురేష్

తిరుపతి ఎడ్యుకేషన్ : బైజూస్ ప్రీమియం కంటెంట్‌తో ప్రీలోడ్ చేసిన ట్యాబ్‌లు మొదటి విడతగా జిల్లాకు చేరుకున్నాయి. సోమవారం ఈ మేరకు డీఈఓ శేఖర్, బైజూస్ జిల్లా నోడల్ అధికారి జి.సురేష్ పలు స్కూళ్లకు పంపిణీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ మొత్తం 17,097 ట్యాబ్‌లు కావాల్సి ఉండగా, తొలివిడతలో 5,729 వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు బైజూస్ ట్యాబ్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 9వ తరగతి వరకు ఈ-కంటెంట్ ఉండగా, ఈ ఏడాది 12వ తరగతి వరకు కంటెంట్ లోడ్ చేశారన్నారు. అలాగే విద్యార్థుల సందేహాల నివృత్తికి ఏఐ ట్యూటర్ అనే ప్రత్యేక యాప్ ప్రీలోడ్ చేసినట్లు వివరించారు. మరో రెండు రోజుల్లో అన్ని ట్యాబ్‌లు జిల్లాకు రానున్నట్లు తెలిపారు.

జనవరి 4న రాగి రేకుల వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన సిల్వర్ కోటెడ్ రాగి రేకులను జనవరి 4వ తేదీన టెండర్ కమ్ వేలం (ఆఫ్‌లైన్‌లో) వేయనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 5,400 కిలోల సిల్వర్ కోటెడ్ రాగి రేకులను వేలానికి ఉంచినట్లు పేర్కొన్నారు. వివరాలకు తిరుపతిలోని హరేరామ హరే కృష్ణ రోడ్డులో ఉన్న టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం, 0877-2264429 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అలాగే టీటీడీ వెబ్‌సైట్ www.tirumala.org సందర్శించవచ్చని సూచించారు.

కాన్ఫరెన్స్‌లో మంత్రి రోజా, ప్రజాప్రతినిధులు, అధికారులు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఐదింతల ఆరోగ్య సిరి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి.. పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలి.. ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారి జీవితాలకు సైతం భరోసా కల్పించాలి.. పైసా ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరూ నాణ్యమైన సేవలు పొందాలి.. ఆస్పత్రుల్లో చికిత్స కోసం ఎవరూ ఆస్తులు అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా చేయూతనందించాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నతంగా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా వెల్లడించారు. అందులో భాగంగానే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరమితిని ఐదింతలు చేసినట్లు వివరించారు.



ఆరోగ్యశ్రీ కొత్త కార్డు ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా, ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- ప్రజారోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యం
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో మరింత భరోసా
- రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పరిమితి పెంపు
- పేదల పాలిట సంజీవనిగా అభివర్ణించిన మంత్రి రోజా
- యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచన

తిరుపతి అర్బన్ : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు పాలిట సంజీవని అని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా తాడేపల్లె క్యాంపు కార్యాలయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం మంత్రిరోజా, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీహరి తదితరులు ఆరోగ్యశ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్యానికి జగనన్న అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పేదలకు ఉచితంగా వైద్యసేవలందించాలన్నదే ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా నాణ్యమైన చికిత్సలందిస్తామని వివరించారు. అందుకే ఆరోగ్యశ్రీ పథకం పరమితిని రూ.5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ,ఆరోగ్య శ్రీ కార్డుదారులు యాప్ డౌన్ లోడ్ చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులను 800 నుంచి 2,304 పెంచామని, 3,252 రకాల వ్యాధులకు ప్రజలు చికిత్సలు పొందవచ్చని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంపై మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిలో కనీసం ఒక్కరితో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు. ఇందుకోసం ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రతి కార్డులో క్యూఆర్ కోడ్, లబ్ధిదారుడి ఫొటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబర్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో పొందుపరిచిన వివరాలపై పూర్తి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అరుణాసులోచనాదేవి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

భారతావనిదే భవిత



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి
- వికసిత్ భారత్ సభలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి సిటీ : ''భవిష్యత్ భారతావనిదే,, 2047 నాటికి శక్తిమంతంగా వెలిగిపోనుంది.. అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించనుంది'' అని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. సోమవారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం గవర్నర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామీణులకు సైతం లబ్ధి చేకూరేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు గడచిన సందర్భంగా రాబోయే 25 ఏళ్లను అమృత్ కాల్ అని పిలుస్తామని వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలు దోహదపడుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విశ్వ గురువుగా భారత్ వెలుగుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని కొనియాడారు. మేయర్ శిరీష మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని వివరించారు. అనంతరం కేంద్ర పథకాల లబ్ధిదారులను గవర్నర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ వీసీ భారతి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, డీపీఓ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

22న జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీకాళహస్తి : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 22వ తేదీన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన వైజ్ఞానిక ప్రదర్శన కో-ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. టీచర్, స్టూడెంట్, గ్రూప్ కింద మూడు విభాగాల్లో ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. టీచర్ విభాగం కింద ఏ సబ్జెక్టు టీచర్ అయినా వారి సబ్జెక్టుకు సంబంధించి ఎగ్జిబిట్ ప్రదర్శించవచ్చునన్నారు. స్టూడెంట్ విభాగం కింద ఒక స్టూడెంటు, గైడర్ టీచర్ పాల్గొనవచ్చని తెలిపారు. స్టూడెంట్ గ్రూపు విభాగం కింద ఇద్దరు స్టూడెంట్స్ మాత్రమే పాల్గొనాలని సూచించారు. ప్రతి మండలం నుంచి తొమ్మిది ఎగ్జిబిట్లు జిల్లా ప్రదర్శనకు హాజరయ్యేలా చూడాలని కో-ఆర్డినేటర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్

ప్రజలకు మరింత మెరుగైన సేవలు



ooooo

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ ఉద్యోగులు మరింత మెరుగ్గా పని చేస్తూ ప్రజలకు చేరువ కావాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం సీఎంఎస్ఎస్ శిక్షణ కేంద్రంలో జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. జనవరి నెలఖరు వరకు జిల్లాలోని 4,056 మంది ఉద్యోగులకు సర్వీసురూల్స్‌పై 7 బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగం కోసం ఎంత కష్టపడ్డారో ఇప్పుడు కూడా అలాగే పనిచేయాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి చిన్నపనికి ప్రజలు సచివాలయాల గడప తొక్కుతున్నారన్నారు. రెవెన్యూ, రక్షణ, సంక్షేమ, ఇంజినీరింగ్, ఆరోగ్యం ఇలా పలు శాఖ కార్యదర్శులు చురుకుగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికీ నవరత్నాలు అందే విధంగా పని చేయాలని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం సచివాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పథకాల అర్హతలను లబ్ధిదారులకు అర్థమయ్యేవిధంగా చెప్పాలన్నా రు. కార్యక్రమంలో టీసీఐఎల్ జిల్లా ఇన్‌చార్జి లలితమ్మ, డీఎల్‌డీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చంద్రగిరిలో మెగా జాబ్ మేళా



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం వైఎస్సార్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మేళాలో 33 మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 3,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచన మేరకు జాబ్‌మేళాకు విచ్చేసే అభ్యర్థులకు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. పదోతరగతి నుంచి ఇంటర్, బీటెక్, ఎంబీఏ విద్యార్హత కలిగినవారు మేళాకు హాజరుకావచ్చన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాకు అర్హులందరూ ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు.

శిల్ప కళాశాలలో సాయంత్రం కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి(అలిపిరి): శ్రీ వేంకటేశ్వర శిల్ప కళాశా లలో సాయంత్రం కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంప్రదాయ కలంకారీ కళ, శిల్పకళల్లో ప్రాథమిక అంశాలు అనే కోర్సులను నూతనంగా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 31వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, గరిష్ఠ వయోపరిమితి లేదని వెల్లడించారు. వివరాలకు 0877-2264637, 986699 7290 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిమాన్వితం..వైకుంఠద్వారం



సమావేశంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ప్రధాన అర్చకులు, అధికారులు

తిరుమల : శ్రీవారి ఆలయంలోని మహిమాన్విత వైకుంఠద్వారం తెరిచి ఉన్న పదిరోజుల్లో ఎప్పుడు వెళ్లి స్వామిని దర్శించుకున్నా ఒకే ఫలితం ఉంటుందని ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈనెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు టోకెన్లు తీసుకున్న భక్తులకు మాత్రమే తిరుమలలో గదులు కేటాయించనున్నట్లు తెలిపారు. అయితే తిరుమలలో గదులు పరిమితంగా ఉన్నందున భక్తులు ఇబ్బంది పడకుండా తిరుపతిలో వసతి పొందాల్సిందిగా కోరారు. వైకుంఠ ద్వార దర్శనార్థం తిరుపతిలోని తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాలు, భూదేవి కాంప్లెక్స్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, జీవకోన హైస్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు హైస్కూల్, ఎమ్మార్‌పల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఉచితంగా సర్వదర్శన టోకెన్లు పొందవచ్చని వెల్లడించారు. అనంతరం వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లోనే కాకుండా మిగిలిన 8 రోజుల్లో ఎప్పుడు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నా అంతే పవిత్రమని వెల్లడించారు. ఈ మేరకు ఆయన వివరించారు. వారి మాటల్లోనే..

- దేవలోకంలో తెల్లవారుజామున 120 నిమిషాలు అంటే భూలోకంలో 30 రోజులతో సమానం. దీన్నే ధనుర్మాసంగా పిలుస్తున్నాం.
- వేకువజామున బ్రహ్మ ముహూర్తంలో శ్రీమహావిష్ణువు 40 నిమిషాలపాటు దేవతలకు, మహర్షులకు దర్శనమిస్తారు.
- ఇది దేవలోకంలో ఆ కాలమానం ప్రకారం ప్రతిరోజు జరిగే ప్రక్రియ.
- భూలోక కాలమానం ప్రకారం సంవత్సరంలో ఒకసారి జరిగే ప్రక్రియగా కనిపిస్తుంది.
- ఈ 40 నిమిషాలు భూలోకంలో 10 రోజులకు సమానం.
- అందుకే వైష్ణవాలయాల్లో ఈ 10 రోజుల్లో వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటే శ్రీమహావిష్ణువును ప్రత్యక్షంగా దర్శనం చేసుకున్న భాగ్యం కలుగుతుందని నమ్మకమని విశదీకరించారు. సమావేశంలో జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్, శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన గోవిందరాజ దీక్షితులు, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, సీఏఓ శేషశైలేంద్ర, ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

డ్రగ్స్ డిస్కవరీపై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతీ వర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్‌పై రీసెంట్ అడ్వాన్సెస్ అండ్ ఫ్యూచర్ ట్రెండ్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ సాంబరెడ్డి మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణలో నూతన పురోగతులు, అధునాతన పద్ధతులను వివరించారు. అనంతరం వీసీ భారతి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహించాలని కోరారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అయ్యప్ప చతుర్వేదులు, కో-ఆర్డినేటర్ బి.శైలజ, కన్వీనర్ ప్రొఫెసర్ బి.రమ్య కుబేర్ పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన అతిథులు

అవార్డు గ్రహీతకు అభినందన



జయచంద్రారెడ్డిని అభినందిస్తున్న టీటీడీ ఈఓ, జేఈఓ

తిరుపతి (అలిపిరి) : ప్రతిష్టాత్మక 'యంగ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా' అవార్డు అందుకున్న డాక్టర్ మెట్టా జయచంద్రారెడ్డిని టీటీడీ ఈఓ ఏఈ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి అభినందించారు. సోమవారం ఈమేరకు వారు మాట్లాడుతూ స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ప్రత్యేకాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న జయచంద్రారెడ్డికి అరుదైన పురస్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రం నుంచి ఈ అవార్డు అందుకున్న తొలివ్యక్తి ఆయనే అని వెల్లడించారు.

తొండవాడకు 'జలజీవన్' అవార్డు



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ దీపికారెడ్డి

చంద్రగిరి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ సురక్షిత తాగునీటిని సమర్థవంతంగా అందిస్తున్న తొండవాడ పంచాయతీకి అవార్డు లభించింది. సోమవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా సర్పంచ్ మల్లం దీపికారెడ్డి అవార్డు అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధిలో పంచాయతీ కీలకభూమిక పోషించిందన్నారు. తమ పంచాయతీకి ఉత్తమ అవార్డు రావడం వెనుక అధికారులు, సిబ్బంది కృషిని మరువలేమని వెల్లడించారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గవర్నర్‌కు సాదర స్వాగతం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

రేణిగుంట/తిరుపతి (అలిపిరి) : తిరుపతి పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయానికి సోమవారం ఉదయం 10.05 గంటలకు చేరుకున్న రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పద్మావతి అతిథి గృహానికి బయలుదేరి వెళ్లారు.

అతిథి గృహం వద్ద గవర్నర్‌కు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, వర్సిటీ వీసీ భారతి, కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఆర్‌డీఓ నిషాంత్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందన స్వీకరించారు.

టీటీడీపై సివిల్ దావా కొట్టివేత

తిరుపతి లీగల్ : టీటీడీపై దాఖలైన సివిల్ దావాను కొట్టివేస్తూ తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ సోమవారం తీర్పునిచ్చింది. ఈమేరకు టీటీడీ న్యాయ సలహాదారుడు ఎల్.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తిరుమల మొదటి ఘాట్ రోడ్డు ఇరువైపులా పూల పడకలు ఏర్పాటు చేయడానికి 2009 ఏప్రిల్ 22వ తేదీన టీటీడీ టెండర్ పిలిచింది. తిరుపతికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ బి.శివశంకర్ రెడ్డి బిడ్ ను దాఖలు చేశారు. రూ.32 లక్షల నిర్మాణాన్ని నాలుగు నెలల్లో పూర్తి చేయాలని టీటీడీ నియమ నిబంధనలు విధించింది. ఈ మేరకు ఇద్దరి మధ్య వర్క్ అగ్రిమెంట్ కుదిరింది. 2009 ఆగస్టులో నిర్మాణ పని పూర్తి చేసినా, టీటీడీ అధికారులు సొమ్ము పూర్తిగా ఇవ్వలేదంటూ కాంట్రాక్టర్ కోర్టులో దావా దాఖలు చేశాడు. దీనిపై టీటీడీ ఈఓ, చీఫ్ ఇంజనీర్, ఫారెస్ట్ కన్జర్వేటర్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ప్రతివాదులుగా దావాలో పేర్కొన్నాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పూర్తిస్థాయిలో విచారించి దావాను కొట్టివేశారని మధుసూదన్‌రెడ్డి వివరించారు.

నాలుగేళ్ల చిన్నారిపై లైంగికదాడి

నాయుడుపేటటౌన్ : మండలంలోని విన్నమాల ఎస్టీ కాలనీ వద్ద నాలుగేళ్ల చిన్నారిపై అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలుడు లైంగిక దాడి చేసినట్లు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గ్రామంలో చిన్నారి ఇంటి వద్ద ఉండగా 14 ఏళ్ల బాలుడు చాక్‌లెట్లు కొనిస్తానని చెప్పి సమీపంలో ఉన్న తమ నివాసానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి యత్నించినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

'పేదల ఆరోగ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. పేదలపాలిట సంజీవనిగా ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదింతలు పెంచి మరింత బలోపేతం చేశారు. ఈ పథకం కింద వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంచారు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షల వరకు పెంపు, కొత్త ఫీచర్ల ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆరోగ్యశ్రీ విస్తరణ మెగా చెక్కును అందజేశారు.

- పేదల ఆరోగ్యమే సర్కారు ధ్యేయం
- 2019 నుంచి రూ.635.15 కోట్లతో 3,18,689 మందికి సర్జరీలు
- లబ్ధిదారులకు కొత్త ఫీచర్ల కార్డులు అందజేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- చిత్తూరులో ఘనంగా జిల్లా స్థాయి ఆరోగ్యశ్రీ కార్యక్రమం



నూతన ఫీచర్లు కలిగిన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే,కలెక్టర్, జెడ్పీ చైర్మన్

చిత్తూరు కలెక్టరేట్ : పేదల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లె క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స ఖర్చు పెంపు రూ.25 లక్షల వరకు, కొత్త ఫీచర్ల ఆరోగ్య శ్రీకార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్ విధానంలో సీఎం ప్రసంగాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో పేద వారికి ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల కార్పొరేట్ ఆస్పత్రుల్లో దాదాపు 3200 జబ్బులకు ఉచితంగా వైద్యం అందించడంలో ఖర్చు పరిమితిని రూ.25 లక్షల వరకు పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీ ఆరోగ్య ఆసరా కింద రాష్ట్ర వ్యాప్తంగా ఏటా దాదాపు రూ.4,100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడుతో ఆస్పత్రుల ఆధునీకరణ, వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించినట్లు వివరించారు. ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల, రిసెర్చ్ సెంటర్లను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ఉన్న 11 మెడికల్ కళాశాలల ఆధునీకరణ, నిర్మాణంలో ఉన్న 17 మెడికల్ కళాశాల నిర్మాణాలకు రూ.32,279 ఖర్చు చేశారన్నారు.

ఆరోగ్య సురక్షలో ఫస్ట్

జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక వైద్య పరీక్షలు చేసిన జిల్లాల్లో చిత్తూరు ప్రథమ స్థానంలో ఉన్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న రెండవ విడత కార్యక్రమాన్ని అదే స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో 2019 నుంచి ఈ ఏడాది నవంబర్ నెల వరకు 3,18,689 మందికి సర్జరీలు నిర్వహించగా, ప్రభుత్వం రూ.635.15 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. శస్త్ర చికిత్స అనంతరం అందించే ఆరోగ్య ఆసరా ద్వారా 1,30,601 మందికి రూ.62.75 కోట్లు ఖర్చు చేశామన్నారు. జిల్లాలో 4,73,877 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం ఆరోగ్యశ్రీ పెంపు మెగా చెక్కును మంత్రి ఆవిష్కరించారు. నూతన ఫీచర్లు కలిగిన ఆరోగ్యశ్రీ కార్డులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, ఎమ్మెల్సీ భరత్, ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ కేజే శాంతి, కార్పొరేటర్ హరిణి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ సుదర్శన్, డీపీఓ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ విస్తరణ మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఆరోగ్యశ్రీలో కంటి ఆపరేషన్



నాకు రెండు కళ్లకు శుక్లాలు రావడంతో చూపు మందగించింది. జగనన్న దయతో ఆరోగ్యశ్రీ ద్వారా నెట్వర్క్ ఆస్పత్రిలో రెండు కళ్లకు ఉచితంగా ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు కళ్లు చాలా బాగా కనిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం లేకుంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖర్చు భరించడం మా వల్ల అయ్యేది కాదు. సీఎం కు రుణపడి ఉంటాం.

– షేక్ మహమ్మద్ జలీల్ షరీఫ్, లబ్ధిదారుడు, చిత్తూరు

ఆసరా కూడా ఆదుకుంది



నేను తోపుడు బండిలో వ్యాపారం చేస్తుంటాను. గత 4 ఏళ్లుగా ముక్కు నొప్పితో బాధపడుతున్నా. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేసుకోవాలంటే ఎంత ఖర్చు అవుతుందో అని భయం. స్తోమత లేకపోవడంతో ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో వలంటీర్ ఆరోగ్య శ్రీ పథకం గురించి చెప్పారు. ఉచితంగా చికిత్స చేయించుకోవడంతో పాటు, ఆరోగ్య ఆసరా కింద రూ.4500 ఇచ్చారు. పేదలకు సీఎం చేస్తున్న మేలు ఎన్నటికీ మరువలేనిది.

– అజీజ్, లబ్ధిదారు, చిత్తూరు

జగనన్న మేలు మరువం



మాది పేద కుటుంబం. ఇంటి పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాను. గుండె సమస్యతో బాధపడుతున్న నేను ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స చేయించుకున్నాను. జగనన్న దయతో రూ.లక్షల విలువ చేసే గుండె ఆపరేషన్ చేసుకున్నాను. ప్రస్తుతం నేను బాగున్నానంటే అందుకు కారణం జగనన్నే. ఆయన మేలును ఎప్పటికీ మరిచిపోను.

– సెల్వి,సత్యనారాయణ పురం,చిత్తూరు

అదుపు తప్పి ఆటో బోల్తా

- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు

వెంకటగిరిరూరల్ : మండలంలోని ఆంజనేయపురం వద్ద సోమవారం సాయంత్రం ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బాలయపల్లె మండలం మల్లెమాల దళితవాడకు చెందిన 13 మంది వెంకటేష్ అనే వ్యక్తి ఆటోలో వాంపల్లె సమీపంలోని అమ్మచెరువు వద్ద వరి నాట్లకు వెళ్లారు. సాయంత్రం కూలి పని ముగించుకుని ఇంటికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఆటోకు అడవి పంది అడ్డుగా రావడంతో తప్పించబోయి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న దాసరి పెంచలయ్య(45) అక్కడికక్కడే మరణించాడు. లక్ష్మమ్మ, వెంకటరత్నమ్మ, సుభాషిణి, కృష్ణయ్య, తిమ్మాయమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనతంర మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు.



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సుభాషిణి

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌తో సెబ్ అధికారులు

పెళ్లకూరు : మండలంలోని కలవకూరు వద్ద సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు సీజ్ చేశారు. సెబ్ సీఐ ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణముఖి నది ఉంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు బండి రమేష్, మర్రి వరదరాజులును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కన్నతండ్రే కాలయముడై..



చిన్నారి మృతదేహం

పిచ్చాటూరు : భార్యభర్తల నడుమ తలెత్తిన ఘర్షణ అభం శుభం తెలియని 14 నెలల కుమారుడి ప్రాణాలను బలితీసుకుంది. వివరాలు.. మండలంలోని టీపీ కోటకు చెందిన దిలీప్(30) పాన్నేరికి చెందిన నళిని(25)ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ప్రకాష్ అనే కుమారుడు ఉన్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న దిలీప్ తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భార్యతో వాగ్వాదానికి దిగిన దిలీప్ ఆగ్రహం పట్టలేక తన కుమారుడు ప్రకాష్‌ను విసిరివేశాడు. బాలుడు ఇంటి తలుపు వద్ద పడిపోయి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. చికిత్స నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు

రైలు నుంచి జారిపడి డ్రైవర్ మృతి

ఓబులవారిపల్లె (అన్నమయ్య జిల్లా): చెన్నై-ముంబయి సూపర్ ఫాస్ట్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కొండా సుమన్ బాబు(33) అనే రైల్వే డ్రైవర్ మృతి చెందారు. వివరాలు.. తిరుపతికి చెందిన కొండా సుమన్ బాబు ఏడేళ్లుగా రైలు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎర్రగుంట్లలో ఆయన విధులకు హాజరు కావాల్సి ఉండటంతో సోమవారం చెన్నై- ముంబయి సూపర్ ఫాస్ట్ రైలులో రేణిగుంట నుంచి స్లీపర్ కోచ్‌లో బయలుదేరారు. ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు సుమన్‌బాబు రైలు నుంచి జారి కిందపడ్డారు. ప్లాట్‌ఫాంపై అరక్కోణం ప్యాసింజర్ రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు గమనించి వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన సుమన్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని రైల్వే అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు.

బాలుడి మృతదేహం వెలికితీత



హనీష్ (ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ : తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా ఆరంబాకం తాలుకా పల్లెవాడకు చెందిన హనీష్ (7) అనే బాలుడి మృతదేహం సోమవారం బీఎన్‌కండ్రిగ మండలం కారణిమిట్ట గ్రామ సమీపంలో వెలికితీశారు. వివరాలు.. వరదయ్యపాళెం మండలం కాంబాకం గ్రామానికి చెందిన రేఖకు తమిళనాడులోని పల్లెవాడ వాసితో వివాహమైంది. రేఖ విలాసాలకు అలవాటు పడి డబ్బు కోసం రమణయ్య అనే వ్యక్తితో కలసి పల్లెవాడలో తమ ఇంటి ఎదురుగా ఉన్న హనీష్‌ను కిడ్నాప్ చేసింది. బాలుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి నగదు డిమాండ్ చేసింది. కిడ్నాప్ విషయం వాట్సాప్‌లో వైరల్‌గా మారడంతో తప్పించుకునేందుకు బాలుడిని హత్య చేసి కారణిమిట్ట శివార్లలో పూడ్చిపెట్టింది. తమిళనాడు పోలీసులు రేఖ, రమణయ్యను విచారించగా మొత్తం విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వారు కారణిమిట్ట గ్రామంలో పూడ్చిపెట్టిన హనీష్ మృతదేహాన్ని వెలికి తీసి తమిళనాడుకు తరలించారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఏర్పేడు : మండలంలోని సదాశివపురంలో సోమవారం ఓ వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. గ్రామానికి చెందిన భూచంద్రనాయుడుతో సుబ్బమ్మ, లోకేష్‌కు ఓ ఇంటి స్థలం విషయంలో వివాదం ఏర్పడింది. దీంతో వారు భూచంద్రనాయుడిపై దాడి చేశారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

పంటలపై గజరాజుల విధ్వంసం



బంగారుపాళెం: ఏనుగులు తొక్కేసిన వరిపంటను చూపుతున్న రైతు

బంగారుపాళెం: మండలంలోని రాగిమానుపెంట, కీరమంద, రాళ్లవంక గ్రామాల్లో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగులు దాడి చేసి ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. రైతులు వేలు, హుస్సేన్‌కు చెందిన చెరకు, వరి, అరటి పంటలపై ఏనుగులు విధ్వంసం సృష్టించి తీవ్ర నష్టం కలిగించాయి. వారం రోజులుగా ఏనుగులు పంటపొలాలపై దాడి చేస్తున్నాయని రైతులు తెలిపారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై గ్రామాలకు వెళ్లాలంటే కూడా భయంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అటవీశాఖ అధికారులు గజదాడుల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు.

గంటావారిపల్లెలో..

నదుం: మండలంలోని గంటావారిపల్లె పంట పొలాలపై ఆదివారం రాత్రి గజరాజులు విరుచుకుపడ్డాయి. గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామికి సుమారు ఎకరా వరి పొలాన్ని తొక్కి తీవ్రంగా నష్ట పరిచాయి. టెంకాయిచెట్లు, సపోటా, అరటి చెట్లు నాశనం చేశాయి. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన వెంకటస్వామి పొలం ధ్వంసమై ఉండడం, చెట్లు నాశనమై ఉండడాన్ని గుర్తించాడు. భారీ నష్టం వాటిల్లిందని వాపోయాడు.

బడుగుల అభివృద్ధి గిట్టని చంద్రబాబు

- బాబు హయాంలో ఆరోగ్యశ్రీ బిల్లుల పెండింగ్
- పేదలకు అండగా సీఎం జగనన్న
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చంద్రబాబు నాయుడు పూర్తి వ్యతిరేకి అని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తీవ్రంగా విమర్శించారు. సోమవారం పుత్తూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి వ్యతిరేకి అని, వారి ఎదుగుల ఆయనకు గిట్టదన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల కోసం ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడంలో తన హయాంలో చంద్రబాబు అసమర్థుడిగా నిలిచారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3,257 వ్యాధులను ఆర్యోశ్రీలో చేర్చి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఇందులో ఆరోగ్య ఆసరా కింద 1,519 వ్యాధులను చేర్చారని గుర్తు చేశారు. గతంలో రూ. 5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని నేడు రూ.25 లక్షలకు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు అన్ని సామాజిక వర్గాల్లోని పేదలకు పెద్ద దిక్కుగా నిలిచారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునేందుకు ఆరోగ్యశ్రీ విస్తరింపజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.1,034 కోట్లు ఖర్చుపెట్టగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4,100 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రిలో చేరిన రోగికి రోజుకు రూ.225 చెల్లిస్తున్న ఘనత కూడా జగనన్నదేనని అన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

చంద్రబాబును నమ్మితే నట్టేట మునిగినట్లే

చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా కలసి అభివృద్ధి పథకాలపై విషప్రచారం చేయడం సమంజసం కాదన్నాదన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కులాలను రెచ్చగొట్టి, తమ సామాజిక వర్గం కోసం పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. కమ్మ సామాజిక వర్గంలో పేదలు కూడా అన్ని సంక్షేమ పథకాలను అందుకుంటున్నారని, వారు కూడా బాబును అస్యహించుకునే రోజులు దగ్గర పడుతున్నాయని హెచ్చరించారు. ఎస్సీ ప్రజాప్రతినిధులు వెళ్లిన రోడ్లపై పసుపునీరు, పేడ చల్లి శుద్ధి చేయిస్తున్న చంద్రబాబును నమ్మి ఎమ్మెల్యే టికెట్ల కోసం వెళుతున్న టీడీపీ వెనుకబడిన తరగతుల నాయకులకు అవమానం తప్పదన్నారు. సీఎం జగనన్న అంబేద్కర్ భావజాలాలు కలిగి ఉన్నారని, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రామచంద్ర పుష్కరిణి వద్ద టోకెన్ కేంద్రం



'దర్శన'ప్రాప్తిరస్తు!

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని వైకుంఠ ద్వార దర్శనానికి భక్తుల కోసం టీటీడీ సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు మహిమాన్విత మార్గం సందర్శనకు అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం ముందస్తుగా టోకెన్లు జారీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో టికెట్ల కోసం వేచి ఉండే భక్తకోటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తోంది. టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి , ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పర్యవేక్షిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



క్యూలో తాగునీటి కొళాయి ఏర్పాటు